ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 23.06.2024 సమయం : 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. నీట్(యూజీ) పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీకి సంబంధించి కేంద్రదర్యాప్తు సంస్థ(సీబీఐ)FIR నమోదు చేసింది.
2. రేపటి నుంచి 18వ లోక్‌సభ తొలి సమావేశాలు ప్రారంభమవుతాయి. ఈ సమావేశాల్లో కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారు.
3. రామగుండంలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (NTPC) ఫ్లైయాష్ కు సంబంధించి 100 కోట్ల మేర కుంభకోణంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాత్ర ఉందని ఆరోపించిన బీఆర్ఎస్ శాసనసభ్యుడు కౌశిక్ రెడ్డితో పాటు ఆరుగురికి మంత్రి పొన్నం ప్రభాకర్ లీగల్ నోటీసులు పంపారు.
4. ఆశావర్కర్లకు నైపుణ్యం పెంచే నెపంతో పరీక్షలు నిర్వహించాలన్న యోచన విరమించుకోవాలని సీపీఐఎం, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

**CBI-NEET EXAM:** నీట్(యూజీ) పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీకి సంబంధించి విద్యాశాఖ చేసిన ఫిర్యాదు మేరకు కేంద్రదర్యాప్తు సంస్థ(సీబీఐ) FIRను నమోదు చేసింది. ఈ అంశానికి సంబంధించి దేశవ్యాప్తంగా నమోదైన అన్ని కేసులను పరిశీలిస్తున్నట్టు, ఈ కుట్రను ఛేదించేందుకు సమగ్ర దర్యాప్తు చేపట్టినట్టు సీబీఐ తెలిపింది. గత నెల 5న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(NTA) నీట్(యూజీ) పరీక్షను నిర్వహించింది. ఈ పరీక్షలో అక్రమాలు, మోసపూరిత చర్యలు, మాల్ ప్రాక్టీస్ వంటి అవకతవకలు జరిగాయని దేశవ్యాప్తంగా పలు చోట్ల కేసులు నమోదయ్యాయి. కాగా, గ్రేస్ మార్కులు పొందిన 15 వందల 63 మంది విద్యార్థులకు ఈ మధ్యాహ్నం పునఃపరీక్ష నిర్వహించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఉన్నత స్థాయి కమిటీ నివేదికపై సుప్రీంకోర్టు పరిశీలన ప్రకారం పునఃపరీక్ష నిర్ణయం తీసుకున్నట్లు, గ్రేస్ మార్కులను రద్దు చేస్తున్నట్లు NTA తెలిపింది. **(NSD)**

**PARLIAMENT:** రేపటి నుంచి 18వ లోక్‌సభ తొలి సమావేశాలు ప్రారంభమవుతాయి. ఈ సమావేశాల్లో కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారు. ప్రొటెం స్పీకర్‌గా నియమితులైన బీజేపీ సీనియర్ ఎంపీ భర్తృహరి మహతాబ్.. కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణం చేయిస్తారు. కొత్త లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఈ నెల 26న జరుగుతుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 27న పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అదేరోజున రాజ్యసభ సమావేశాలు ప్రారంభమవుతాయి. వచ్చే నెల 3వ తేదీతో పార్లమెంట్ సమావేశాలు ముగుస్తాయి. **(NSD)**

**PONNAM:** రామగుండంలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (NTPC) ఫ్లైయాష్ కు సంబంధించి 100 కోట్ల మేర కుంభకోణంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాత్ర ఉందని ఆరోపించిన బీఆర్ఎస్ శాసనసభ్యుడు కౌశిక్ రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ లీగల్ నోటీసులు పంపారు. తనకు పరువునష్టం జరిగిందని పేర్కొంటూ... బీఆర్ఎస్ శాసనసభ్యుడు కౌశిక్ రెడ్డి, ఒక వార్త ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ కుమార్, ప్రాంతీయ తెలుగు దినపత్రిక ఎడిటర్ తీగుళ్ల కృష్ణమూర్తితో సహా ఏడుగురికి నోటీసులు పంపారు. NTPC రామగుండం నుంచి ఫ్లైయాష్ ను అక్రమంగా రవాణా చేసేందుకు పొన్నం ప్రభాకర్.. రోజుకు 50 లక్షల రూపాయలను తీసుకున్నారని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. దీనిపై చర్చించేందుకు పొన్నం ప్రభాకర్ ముందుకు రావాలని సవాల్ విసిరారు. **(SHANKAR)**

**KOMATIREDDY:** ఉమ్మడి నల్గొండ జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఈరోజు ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.... హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిపై 17 బ్లాక్ స్పాట్లను గుర్తించామని, వీటికి 325 కోట్లతో పనులు చేపట్టి.. డిసెంబర్ లోపు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. ఆగస్టు 15లోగా రైతులకు 2 లక్షల రూపాయల రుణమాఫీని పూర్తి చేస్తామన్నారు. వారం రోజుల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే కార్యక్రమం చేపడతామని, స్వంత స్థలం ఉంటే తక్షణమే ఇల్లు ఇస్తామని, స్థలం లేనివారికి ప్రభుత్వ స్థలం ఉన్నచోట ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు.**(PTC)**

**POCHARAM :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం నిజాంసాగర్ మండలం లోని నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువ ద్వారా వానాకాలం పంటల సాగుకు ఈ రోజు మాజీ శాసనసభ సభాపతి, పోచారం శ్రీనివాస రెడ్డి, జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతారావు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.... రైతుల కోరిక మేరకు సాగునీటి శాఖ అధికారులను సంప్రదించి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతితో వానాకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేశామన్నారు. ప్రాజెక్టులలో నీళ్లులేని కారణంగా రాష్ట్రంలోని ఏ సాగునీటి ప్రాజెక్టు ఆయకట్టుకు కూడా ఈ ఏడాది వానాకాలం పంటల సాగుకు నీరు విడుదల చేయలేదని తెలిపారు. **(PN)**

**BJP MLA HARIBABU:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలోని అందవెల్లి పెద్దవాగు వద్ద తక్షణమే తాత్కాలిక బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని.. లేనిచో నిరవధిక నిరాహార దీక్ష చేపడుతానని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే హరీష్ బాబు హెచ్చరించారు. తెగిన అందవెల్లి బ్రిడ్జి వద్ద తాత్కాలిక రహదారిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అందవెల్లి బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించడంలో.. ప్రభుత్వం జాప్యం చేయడం వల్లనే పనులు పూర్తి కావడం లేదన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రితో పాటు మంత్రి సీతక్క దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. తక్షణమే తాత్కాలిక రహదారి పునర్నిర్మాణం చేపట్టాలని.. లేనిచో వంతెన వద్ద బీజేపీ శ్రేణులతో కలిసి నిరవధిక నిరాహార దీక్ష చేయనున్నట్లు హెచ్చరించారు. **(PTC)**

**SINGARENI :** సింగరేణి సంస్థ రాష్ట్ర ఆర్థిక సామాజిక జీవనాడి అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కరీంనగర్ లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ....తెలంగాణ ప్రాంతంలో ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్నటువంటి సింగరేణి సంస్థ లక్షలాది మంది గ్రామీణ నిరుపేదలకు జీవితాన్ని ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి సంస్థ లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ ప్రవేట్ పరం చేయాలన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం తప్పు చేస్తున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. బొగ్గు బావుల వేలం కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం యొక్క దిగజారుడుతనానికి నిదర్శనం అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేసారు.**(PTC)**

**CPIM:** ఆశావర్కర్లకు నైపుణ్యం పెంచే నెపంతో పరీక్షలు నిర్వహించాలన్న యోచన విరమించుకోవాలని సీపీఐఎం రాష్ట్ర శాఖ, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఈ మేరకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. ఆశా కార్యకర్తల నైపుణ్యాలు పెంచేందుకే ఈ పరీక్ష నిర్వహిస్తున్నాం తప్ప వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు కాదని అధికారులు చెబుతున్నప్పటికీ, పరీక్ష నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం అవుతోందని తెలిపారు. దీంతో 28 వేల మంది ఆశా కార్యకర్తల్లో అభద్రత భావం చోటుచేసుకుందని ఆ లేఖలో పేర్కొన్నారు. పరీక్షల యోచన విరమించుకుని, గతంలో మాదిరిగా శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని ఆయన కోరారు. **(SHANKAR)**

**DIED:** పద్మశ్రీ అవార్డు గ్రహీత, సాంస్కృతిక ఆదివాసి డోలి కళాకారుడు సకిని రామచంద్రయ్య ఈరోజు కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రామచంద్రయ్య... భద్రాద్రికొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలంలోని కూనవరంలో గల తన స్వగృహంలో ఈరోజు తుది శ్వాస విడిచారు. ఆదివాసి కళల సంరక్షణలో ఆయన అంకితభావాన్ని గౌరవిస్తూ కేంద్రప్రభుత్వం 2022లో పద్మశ్రీ అవార్డును బహుకరించింది. సమ్మక్క-సారలమ్మ కథలను చెప్పడంలో కోయ కళాకారుడు రామచందయ్య ఒక్కరే. గడిచిన పలు దశాబ్దాలుగా మేడారం జాతరకు ప్రభుత్వ అధికారిక అతిథిగా రామచంద్రయ్య గౌరవం పొందారు. వారసత్వంగా లభించిన సాంస్కృతిక కళ విధానాన్ని ఆయన బాధ్యతగా స్వీకరించారు. తన 12వ ఏటా నుంచి డోలి కళను ప్రదర్శించడం ప్రారంభించారు. **(PTC)**

**SHUT DOWN:** హైదరాబాద్ నగరంలో వాణిజ్య సంస్థలు ప్రతిరోజు రాత్రి పదిన్నర గంటల నుంచి 11 గంటల మధ్యన మూసివేయాలని హైదరాబాద్ పోలీస్ విభాగం సూచించింది. ఇటీవలి కాలంలో జరుగుతున్న నేరాలను అదుపు చేసేందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సూచనల మేరకు పోలీస్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. **(PN)**